'హెచ్-1బీ' వీసా స్కామ్!

మొదటిపేజీ తరువాయి...

కల్పిస్తుంది. టెక్ కంపెనీలు దీనిపై ఆధారపడి ఏటా భారత్, చైనా వంటి దేశాల నుంచి వేలాది మంది ఉద్యోగులను నియమించుకొంటున్నాయి. ఏటా పరిమిత సంఖ్యలో 85 వేల హెచ్-1బీ వీసాలను మాత్రమే జారీ చేస్తారు. వీటి కోసం లక్షల మంది దరఖాస్తు చేసుకొంటూ ఉంటారు. ప్రారంభంలో ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ ప్రాతిపదికన వీసాలను జారీ చేసినప్పటికీ గత కొన్నేండ్లుగా కంప్యూటరైజ్ జనరేటెడ్ లాటరీ ద్వారా ఎంపిక చేసి అర్హులైన వారికి వీసాలు ఇస్తున్నారు. అయితే, ఈ లాటరీ ప్రక్రియలో కొన్ని కంపెనీలు మోసాలకు పాల్పడుతున్నట్టు 'బ్లూమ్‌బర్గ్' పరిశీలనలో తాజాగా తేలింది.

ఎలా కనిపెట్టారంటే?

హెచ్-1బీ వీసాల కోసం 2023లో 4,46,000 దరఖాస్తులు వచ్చాయి. క్రితం ఏడాదితో పోలిస్తే, ఇది చాలా ఎక్కువగా ఉన్నది. 2020 నుంచి దరఖాస్తులు అనూహ్యంగా పెరుగుతూ వస్తున్నాయి. దీంతో బ్లూమ్‌బర్గ్ టీమ్.. వీసా దరఖాస్తులు, వీసాల జారీ, లాటరీ ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను అమెరికా ప్రభుత్వం ఇచ్చిన డేటా సాయంతో విశ్లేషించింది. వీసాలను ఎలాగైనా దక్కించుకోవడానికి కొందరు అక్రమార్కులు లాటరీ రిగ్గింగ్‌కు పాల్పడుతున్నట్టు ఈ విశ్లేషణలో బ్లూమ్‌బర్గ్ నిర్ధారణకు వచ్చింది. ఒకే అభ్యర్థి పేరును వివిధ కంపెనీల ద్వారా కోట్ చేస్తూ.. ఒకటి కంటే ఎక్కువ రిజిస్ట్రేషన్లు దాఖలు చేసినట్టు బ్లూమ్‌బర్గ్ వెల్లడించింది. ఇలా.. ఒక్క ఏడాదిలోనే 15,500 వీసాలు పక్కదారి పట్టినట్టు వివరించింది. అంటే జారీ చేసిన ప్రతీ ఆరు వీసాల్లో ఒకటి అక్రమార్కులకు చేరినట్టు తెలిపింది. నాలుగేండ్ల వ్యవధిలో, ఒక కంపెనీ ఒకే దరఖాస్తుదారుడి పేరును ఏకంగా 15సార్లు రిజిస్టర్ చేసినట్టు, దీని కోసం డజనుకు పైగా కంపెనీలను వాడుకొన్నట్టు వెల్లడించింది. దీంతో వీసాలు దక్కాల్సిన అర్హులకు అవి దక్కకుండాపోయాయని వివరించింది.

సూత్రధారుల్లో కాంగ్రెస్ నేత

ఆదిలాబాద్‌కు చెందిన కాంగ్రెస్ నేత కంది శ్రీనివాస్ రెడ్డి.. పలు కంపెనీల సాయంతో ఈ లాటరీ రిగ్గింగ్‌లో భాగమైనట్టు బ్లూమ్‌బర్గ్ వెల్లడించింది. 2020 నుంచి ఇప్పటి వరకూ ఈయనకు చెందిన కంపెనీలకు 300కు పైగా హెచ్-1బీ వీసాలు దక్కినట్టు వివరించింది. మెషీన్ లర్నింగ్ టెక్నాలజీస్ ఎల్ఎల్‌సీ, డేటా సైన్స్ టెక్నాలజీస్ ఎల్ఎల్‌సీ, రోబోటిక్స్ టెక్నాలజీస్ ఎల్ఎల్‌సీ ఇలా ఒకే పేరును స్ఫురించేలా దాదాపు 15 కంపెనీల ద్వారా శ్రీనివాస్ రెడ్డి ఈ రిగ్గింగ్‌లో పాల్గొన్నట్టు తమ విశ్లేషణలో వెల్లడైందని బ్లూమ్‌బర్గ్ తెలిపింది. శ్రీనివాస్ రెడ్డిని 'మ్యాన్ బిహైండ్ ఏ స్కీమ్' అని పేర్కొంటూ ఈ వివరాలను బ్లూమ్‌బర్గ్ ప్రత్యేకంగా ప్రచురించింది. అక్రమార్కులు తమ దగ్గరికి వచ్చిన వారికే వీసాలు రావాలనే దురుద్దేశంతో ఇలా ఎక్కువ సంఖ్యలో రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నట్టు బ్లూమ్‌బర్గ్ వెల్లడించింది. అక్రమాలకు పాల్పడ్డ ఆయా కంపెనీలు ఉద్యోగులకు తక్కువ వేతనాలు ఇస్తున్నట్టు వివరించింది.

కఠిన నిబంధనలు

హెచ్-1బీ వీసాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో మోసాలు జరుగుతున్నట్టు గతంలో కూడా పెద్దయెత్తున వార్తలు వచ్చాయి. దీంతో ఈ మోసాలను అరికట్టేందుకు అమెరికా పౌరసత్వ, వలస సేవల సంస్థ (యూఎస్‌సీఐఎస్) గత జనవరిలో కీలక నిర్ణయం తీసుకొన్నది. 2025 ఆర్థిక సంవత్సరానికి జారీ చేసే వీసాల ఎంపిక ప్రక్రియకు కొత్త నిబంధనలు ప్రకటించింది. ఒక లబ్ధిదారు ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు చేసుకున్నా.. ఒకే అప్లికేషన్‌గా పరిగణిస్తామని వెల్లడించింది. ప్రతి లబ్ధిదారు సరైన పాస్‌పోర్ట్ వివరాలు, ప్రయాణ పత్రాలను తప్పనిసరిగా సమర్పించాలని రూల్ పెట్టింది. తప్పుడు సమాచారం ఇస్తే ఆ పిటిషన్లను రద్దు చేస్తామని హెచ్చరించింది.

ఎవరీ కంది శ్రీనివాస్ రెడ్డి?

ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం హస్నాపూర్‌కు చెందిన కంది శ్రీనివాసరెడ్డి అమెరికాలో పలు సాఫ్ట్‌వేర్ సంస్థలను నడిపిస్తున్నారు. ఎమ్మెల్యే కావాలన్న ఆకాంక్షతో రెండేండ్ల కిందట రాజకీయాల్లోకి ప్రవేశించారు. తొలుత బీజేపీలో చేరారు. అయితే, ఆ పార్టీలో టికెట్ లభించే అవకాశం లేకపోవడంతో అసెంబ్లీ ఎన్నికలకు ఆరు నెలల ముందు కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే టికెట్ లక్ష్యంగా పార్టీ అధిష్ఠానం పెద్దలకు భారీగా డబ్బులు ఇచ్చి కాంగ్రెస్‌లో ఆయన చేరినట్టు ప్రచారం జరిగింది. ఆర్థికంగా బలమైన వ్యక్తి కావడంతో ఎన్నికలకు ముందు ఆదిలాబాద్ నియోజకవర్గంలో ప్రజలకు పెద్ద సంఖ్యలో ఈయన కుక్కర్లు పంపిణీ చేశారు. అయితే కాంగ్రెస్‌లోకి ఈయన రాకను పార్టీ సీనియర్ నాయకులు సుజాత, సాజిద్ ఖాన్ తీవ్రంగా వ్యతిరేకించారు. అయినప్పటికీ, కాంగ్రెస్ అధిష్ఠానం పట్టించుకోకపోవడంతో తమ పదవులకు వాళ్లు రాజీనామా చేశారు. స్థానిక నాయకుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చినప్పటికీ.. అసెంబ్లీ ఎన్నికల్లో శ్రీనివాస్ రెడ్డికి పార్టీ టికెట్ కేటాయించింది. అయితే, ఆ ఎన్నికల్లో ఆయన ఓడిపోయారు. నెలలో నియోజకవర్గంలో 15 రోజులు.. అమెరికాలో 15 రోజులు శ్రీనివాస్ రెడ్డి ఉంటారని స్థానికులు చెబుతారు. ఈయనకు ఓ న్యూస్ ఛానల్ కూడా ఉంది.

నీళ్లు కారుతున్న పార్లమెంట్ పైకప్పు, అక్కడే కింద ఉంచిన బకెట్

కొత్త పార్లమెంట్ భవనంలో లీకేజీ

- ఏడాది కాకుండానే కారుతున్న రూఫ్
- రూ.971 కోట్లతో నిర్మించి ఈ దుస్థితి ఏంటంటూ విపక్షాల మండిపాటు

న్యూఢిల్లీ: ఢిల్లీలో బుధవారం కురిసిన భారీ వర్షం అటు జనజీవనాన్ని స్తంభింపచేయగా, వందల కోట్ల రూపాయలతో నిర్మించిన కొత్త పార్లమెంట్ భవనం అసలు రంగును బయటపెట్టింది. భవనం రూఫ్ నుంచి నీరు కారడం ప్రారంభించింది. పార్లమెంట్ భవనం లాబీలో వర్షం నీరు లీకేజీలను గుర్తించిన పార్లమెంట్ సభ్యులు విస్తుపోయారు. రూ.971 కోట్లతో ఏడాది క్రితమే నిర్మించిన కొత్త పార్లమెంట్ భవనంలో లీకేజీలు ఏమిటంటూ మండిపడ్డారు.

బయట పేపర్ లీకేజీ.. లోపల వాటర్ లీకేజీ

పార్లమెంట్ ప్రాంగణంలో నీటి లీకేజీపై కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ విమర్శలు గుప్పించారు. 'బయట పేపర్ లీకేజీ.. లోపల వాటర్ లీకేజీ' అంటూ ఆయన ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. ఈ భవనం మోదీ అహంకారానికి ప్రతీకగా నిలిచే భయంకరమైన భవనం అని టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా విమర్శించారు. 'కొత్త పార్లమెంట్ భవనం కన్నా పాతదే బాగుంది' అంటూ ఎస్పీ చీఫ్ అఖిలేశ్ పేర్కొన్నారు.

విదేశాల్లో 13 లక్షల మంది భారతీయ విద్యార్థులు

న్యూఢిల్లీ: విదేశాల్లో 13 లక్షల మందికి పైగా భారతీయ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. రాజ్యసభలో సభ్యుడొకరు అడిగిన ఒక ప్రశ్నకు విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. అమెరికా, కెనడా, యూకే, ఆస్ట్రేలియా, జర్మనీ, ఫ్రాన్స్, సింగపూర్, రష్యా, ఇజ్రాయెల్, ఉక్రెయిన్ సహా 108 దేశాల్లో మన విద్యార్థులు చదువుకుంటున్నారని చెప్పారు. కెనడాలో 4,27,000, అమెరికాలో 3,37,630, చైనాలో 8580 మంది విద్యార్థులు ఉన్నట్టు తెలిపారు.

భారత పౌరసత్వాన్ని వదులుకున్న 2.16 లక్షల మంది

న్యూఢిల్లీ: భారత పౌరసత్వాన్ని వదులుకొని విదేశాల్లో స్థిరపడుతున్న వారి సంఖ్య భారీగా ఉంటున్నది. 2023లో ఏకంగా 2,16,219 మంది భారత పౌరసత్వాన్ని వదులుకున్నారు. విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఈ మేరకు వెల్లడించారు.

పౌరసత్వం వదులుకున్న వారి సంఖ్య

2020 –	85,256
2021 –	1,63,370
2022 –	2,25,620
2023 –	2,16,219

ఆగస్టు, సెప్టెంబర్‌లో సాధారణం కంటే అధిక వర్షపాతం

న్యూఢిల్లీ: ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సాధారణం కంటే అధికం వర్షపాతం నమోదయ్యే అవకాశమున్నదని ఐఎండీ అంచనా వేసింది. ఆగస్టు మాసాంతానికి లానినా పరిస్థితులు మెరుగుపడతాయని, ఫలితంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆగస్టు, సెప్టెంబర్‌లో భారత్‌లో కురిసే వర్షపాతం దీర్ఘకాల సగటు 422.8 మిల్లీమీటర్లలో 108 శాతంగా ఉంటుందని పేర్కొన్నది. జూన్ 1 నుంచి చూసుకుంటే దేశ సగటు వర్షపాతం 445.8 మి.మీ. కాగా ఇప్పటికే 453.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. వాయువ్య భారతంలో రానున్న ఐదు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ ప్రకటించింది.

బీజేపీ దిష్టిబొమ్మలు దహనం

అమృతసర్‌లో ప్రధాని మోదీ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న రైతు సంఘాల నాయకులు

పంజాబ్, హర్యానాలో రైతుల నిరసనలు
ఎంఎస్పీకి చట్టబద్ధతకు డిమాండ్

చండీగఢ్: కేంద్ర ప్రభుత్వంపై నిరసన తెలుపుతున్న రైతు సంఘాల నేతలు గురువారం పంజాబ్, హర్యానా రాష్ర్టాల్లో బీజేపీ దిష్టి బొమ్మలను దహనం చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా ఈ నిరసనలకు నాయకత్వం వహించాయి. వ్యవసాయోత్పత్తులకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) కల్పించాలని, దీనికి చట్టబద్ధ హామీ ఇవ్వాలని వీరు డిమాండ్ చేస్తున్నారు. రైతులు శంభు సరిహద్దు, అమృత్‌సర్, మోగా, కురుక్షేత్ర, అంబాలా, పంచకులల్లో బీజేపీ దిష్టి బొమ్మలను దహనం చేశారు.

వాణిజ్య సిలిండర్‌పై రూ.6.5 పెంపు

2% పెరిగిన విమాన ఇంధన ధర

న్యూఢిల్లీ, ఆగస్టు1: వాణిజ్య సిలిండర్ ధర రూ.6.5 పెరిగింది. అలాగే విమాన ఇంధనం(ఏటీఎఫ్) ధర కిలో లీటర్‌కు 2 శాతం పెంచారు. తాజా పెంపు ప్రకారం 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధర రూ.1652.50కి చేరింది. ఏటీఎఫ్ కిలో లీటర్ ధర దేశ రాజధానిలో రూ.1827.34(1.9 శాతం) పెరిగి రూ.97,975.72గా నిలిచింది. గృహావసరాలకు వాడే గ్యాస్ సిలిండర్, డీజిల్, పెట్రోల్ ధరల్లో ఎలాంటి పెంపు లేదు.

'హారిస్ భారతీయురాలా? నల్ల జాతీయురాలా?'

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ భారతీయురాలా? లేక నల్ల జాతీయురాలా? అని రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ప్రశ్నించారు. ట్రంప్ బుధవారం షికాగోలో జరిగిన జాతీయ బ్లాక్ జర్నలిస్టుల సంఘం సమావేశంలో మాట్లాడుతూ, కమలా హారిస్ భారతీయురాలని తనకు తెలుసున్నారు. ఆమె కొన్నేళ్ల క్రితం నల్ల జాతీయురాలిగా మారే వరకు ఆమె నల్లజాతీయురాలనే విషయం తనకు తెలియదన్నారు. ఇప్పుడు ఆమె తాను నల్ల జాతీయురాలిగా గుర్తింపు పొందాలని కోరుకుంటున్నారని చెప్పారు. దీనిపై కమల స్పందిస్తూ, ఇవి విభజన వాదం, అగౌరవంతో కూడిన పాత మాటలేనని మండిపడ్డారు.

నీట్ అక్రమాల కేసులో సీబీఐ చార్జిషీట్

నిందితులుగా 13 మంది

న్యూఢిల్లీ, ఆగస్టు 1: నీట్-యూజీ పరీక్ష అక్రమాల కేసులో సీబీఐ గురువారం మొదటి చార్జిషీట్‌ను దాఖలు చేసింది. 13 మందిని ఈ కేసులో నిందితులుగా చేర్చినట్టు అధికారులు తెలిపారు. పేపర్ లీక్‌తో పాటు పరీక్షలో అక్రమాలకు పాల్పడిన కేసుల్లో వీరి పాత్ర ఉందని చెప్పారు. ఈ కేసుల్లో విచారణ కొనసాగుతుందని పేర్కొన్నారు. కాగా, నీట్-యూజీలో అక్రమాలు, పేపర్ లీకేజీకి సంబంధించి విచారణ జరుపుతున్న సీబీఐ ఆరు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేసిన సంగతి తెలిసిందే. వీటిల్లో బీహార్‌లో నమోదైన ఎఫ్ఐఆర్.. పేపర్ లీక్‌కు సంబంధించినది కాగా, గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్రలో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లు అక్రమాలు, చీటింగ్, ఒకరికి బదులుగా వేరొకరు పరీక్ష రాయడానికి సంబంధించినవి.

సీయూఈటీ తర్వాత మిగిలిన

సీట్ల భర్తీకి సొంతంగా పరీక్ష

సెంట్రల్ వర్సిటీలకు అనుమతి

న్యూఢిల్లీ: సీయూఈటీ ద్వారా ప్రవేశాలు జరిగిన తర్వాత మిగిలిపోయిన యూజీ, పీజీ కోర్సుల సీట్లను భర్తీ చేయడంపై సెంట్రల్ యూనివర్సిటీలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కీలక ఆదేశాలు జారీ చేసింది. సొంత ప్రవేశ పరీక్షలు నిర్వహించడం ద్వారా లేదా అర్హత పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా వాటిని భర్తీ చేసుకోవచ్చని చెప్పింది. సీయూఈటీ ద్వారా చాలా రౌండ్ల కౌన్సెలింగ్ నిర్వహించిన తర్వాత కూడా కొన్ని సీట్లు మిగిలిపోవడాన్ని గుర్తించిన తర్వాత యూజీసీ ఈ ఆదేశాలు జారీ చేసింది.

ఢిల్లీలో కుండపోత

ఆరుగురి మృతి

న్యూఢిల్లీ: దేశ రాజధాని నగరం ఢిల్లీలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షాల వల్ల ఇద్దరు బాలలు సహా ఆరుగురు మరణించారు. ముగ్గురు గాయపడ్డారు. డ్రెయిన్లను మూయడంలో, విద్యుత్తు తీగలను సురక్షితంగా ఉంచడంలో అధికారుల నిర్లక్ష్యం అమాయకుల ప్రాణాలను బలి తీసుకుంది. తనూజ (22), ఆమె మూడేళ్ల కుమారుడు ప్రియాన్ష్ ఘాజీపూర్ ప్రాంతంలో వారపు సంతకు వెళ్లారు. అక్కడ నీటితో పొంగిపొర్లుతున్న కాలువలో పడిపోయి, మునిగిపోయారు. రాజస్థాన్‌లోని మండవర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గాగ్రోన్ వంతెనపై భారీ వరద నీరు ప్రవహిస్తుండగా, బైక్‌పై ప్రయాణించిన ముగ్గురు వ్యక్తులు కొట్టుకుపోయారని పోలీసులు తెలిపారు.

మథురపై హిందూ సంస్థల వాదన సబబే

అలహాబాద్ హైకోర్టు

ప్రయాగ్‌రాజ్: యూపీలోని మథుర ఆలయం కేసులో ముస్లింలకు ఎదురు దెబ్బ తగిలింది. మథురలోని కృష్ణ జన్మభూమి-షాహీ ఈద్గాల వివాదానికి సంబంధించి దాఖలైన 18 కేసులు విచారించ దగ్గవేనని, వాటి విచారణ యథావిధిగా కొనసాగుతుందని అలహాబాద్ హైకోర్టు తీర్పు చెప్పింది. ఈ దావాల విచారణను సవాల్ చేస్తూ మసీదు కమిటీ, వక్ఫ్ బోర్డు దాఖలు చేసిన పిటిషన్‌లను కోర్టు కొట్టివేసింది. కేసు విచారణను ఆగస్టు 12వ తేదీ నుంచి కొనసాగిస్తామని తెలిపింది. మథురలోని కృష్ణ జన్మభూమి ఆలయానికి పక్కనే 13.37 ఎకరాల్లో ఉన్న షాహీ ఈద్గా మసీదును తొలగించాలంటూ హిందూ సంస్థలు పిటిషన్లు వేశాయి.

300 బ్యాంకులపై ర్యాన్సమ్‌వేర్ దాడి

న్యూఢిల్లీ, ఆగస్టు 1: ర్యాన్సమ్‌వేర్ దాడి కారణంగా దేశవ్యాప్తంగా 300 స్థానిక బ్యాంకుల్లో చెల్లింపు వ్యవస్థ తాత్కాలికంగా షట్‌డౌన్ అయ్యింది. ఈ దాడి కారణంగా ఆయా బ్యాంకుల ఖాతాదారులు ఏటీఎంల ద్వారా లేదా యూపీఐ ద్వారా నగదు ఉపసంహరణ లాంటి సేవలను పొందలేకపోయారు. సీ-ఎడ్జ్ టెక్నాలజీస్‌ను ర్యాన్సమ్‌వేర్ దాడి ప్రభావితం చేసిందని.. మిగతా బ్యాంకుల సేవలు సాధారణంగా పని చేస్తున్నాయని భారత జాతీయ చెల్లింపుల కార్పొరేషన్(ఎన్‌పీసీఐ) అధికారులు తెలిపారు.

భారీ వర్షాల వల్ల ఉప్పొంగి ప్రవహిస్తున్న బియాస్ నది

హిమాచల్‌లో వర్ష బీభత్సం

ఐదుగురి మృతి.. 50 మంది మిస్సింగ్, ఇండ్లు, రోడ్లు, వంతెనలు ధ్వంసం

న్యూఢిల్లీ: హిమాచల్ ప్రదేశ్‌ను కుండపోత వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. బుధవారం రాత్రి కురిసిన వర్షాల ధాటికి ఐదుగురు ప్రాణాలు కోల్పోగా, 50 మంది గల్లంతయ్యారు. అనేక ఇండ్లు, వంతెనలు, రోడ్లు ధ్వంసమయ్యాయి. కుల్లు జిల్లాలోని నిర్మండ్, సైంజ్, మలానా ప్రాంతాలు, మండీ జిల్లాలోని పధర్, సిమ్లా జిల్లాలోని రాంపూర్‌లలో భారీ వర్షాలు కురిశాయి. కాంగ్రా, కుల్లు, మండీ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. శ్రీఖండ్ మహదేవ్‌లో బుధవారం రాత్రి కురిసిన కుండపోత వర్షం వల్ల అకస్మాత్తుగా వరదలు సంభవించాయి. దీంతో రాంపూర్‌లో ఇద్దరు మరణించగా, దాదాపు 30 మంది గల్లంతయ్యారు. సిమ్లా డిప్యూటీ కమిషనర్ అనుపమ్ కాశ్యప్ మాట్లాడుతూ, గల్లంతయినవారిలో నలుగురిని కాపాడినట్లు చెప్పారు. మనాలీ-చండీగఢ్ జాతీయ రహదారిపై చాలా చోట్ల కొండచరియలు విరిగిపడినట్లు తెలిపారు.

ఉత్తరాఖండ్‌లో ఉప్పొంగిన నదులు

14 మంది మృతి

డెహ్రాడూన్, ఆగస్టు 1 : ఉత్తరాఖండ్‌లో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షాల వల్ల 14 మంది మరణించారు. ఆరుగురు గాయపడ్డారు. అనేక ఇళ్లు ధ్వంసమయ్యాయి. నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పలుచోట్ల కొండచరియలు విరిగిపడిన నేపథ్యంలో భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని కేదార్‌నాథ్ యాత్రను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. కేదార్‌నాథ్ భక్తులను హెలికాప్టర్ల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. వీరికి ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, పోలీసు, జిల్లా అధికారులు సహాయపడుతున్నారు. డెహ్రాడూన్‌లో 24 గంటల్లో 172 మిల్లీ మీటర్ల వర్షం కురిసిందని వాతావరణ శాఖ తెలిపింది. హరిద్వార్‌లోని రోషనాబాద్‌లో అత్యధికంగా 210 మిల్లీమీటర్లు, రైవాలాలో 163 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు పేర్కొంది.

296కు చేరిన వయనాడ్ మృతులు

కొనసాగుతున్న సహాయక చర్యలు

వయనాడ్, ఆగస్టు 1: కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడ్డ ఘటనలో మృతుల సంఖ్య గురువారం నాటికి 296కు చేరింది. చలియార్ నదిలోనే ఇప్పటివరకు 144 మృతదేహాలు లభ్యమయ్యాయి. ఇప్పటికీ 240 మంది ఆచూకీ కనిపించడం లేదు. 200 మంది గాయపడి వివిధ దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. వెయ్యి మందిని సురక్షితంగా కాపాడినట్టు అధికారులు తెలిపారు. ప్రభుత్వం 82 సహాయక శిబిరాలను ఏర్పాటుచేయగా 8,204 మంది ఆశ్రయం పొందుతున్నారు. కొండచరియలు విరిగిపడ్డ ప్రాంతాల్లో గురువారం కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పర్యటించి బాధితులను పరామర్శించారు.

31 గంటల్లో వంతెన నిర్మాణం

కొండచరియలు విరిగిపడ్డప్పుడు చూరల్‌మల, ముండక్కై మధ్య ఉన్న వంతెన కూలిపోవడం సహాయక చర్యలకు తీవ్ర ఆటంకంగా మారింది. దీంతో ఆర్మీలోని మద్రాస్ ఇంజినీర్ గ్రూప్ బృందానికి చెందిన 140 మంది ఇక్కడకు చేరుకొని కొత్త వంతెన నిర్మాణాన్ని ప్రారంభించారు. 31 గంటల పాటు శ్రమించి 190 అడుగుల బెయిలీ వంతెన నిర్మాణాన్ని పూర్తి చేశారు. దీంతో ముండక్కైలో సహాయక చర్యలు వేగం పుంజుకున్నాయి.

ముండక్కై-చూరల్ మల మధ్య బైలీ వంతెనను నిర్మిస్తున్న సైనికులు

పోస్ట్‌మార్టమ్ చేయలేక పారిపోవాలని అనుకున్నా : వైద్యురాలి భావోద్వేగం

మృతదేహాలకు పోస్ట్‌మార్టమ్ చేస్తున్న ఓ మహిళా వైద్యురాలి ఆవేదన ఇక్కడి దయనీయ పరిస్థితులను అద్దం పడుతోంది. 'మృతుల శరీరాలు గుర్తించలేనంతగా ఛిద్రమయ్యాయి. ఏడాది చిన్నారి మృతదేహాన్ని చూడలేకపోయా. పోస్టుమార్టమ్ చేయలేక బాధితుల సహాయక శిబిరానికిపారిపోవాలనుకున్నా' అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

పూజా ఖేద్కర్ ముందస్తు బెయిల్ దరఖాస్తు తిరస్కరణ

న్యూఢిల్లీ: వివాదాస్పద ఐఏఎస్ ట్రైనీ ఆఫీసర్ పూజా ఖేద్కర్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు ఢిల్లీ కోర్టు గురువారం తిరస్కరించింది. అంతేకాకుండా ఇటీవలి కాలంలో యూపీఎస్సీ సిఫారసు చేసినవారిలో ఎవరైనా ఓబీసీ, దివ్యాంగుల కోటాను దుర్వినియోగం చేశారా? ఓబీసీ కోటా కింద అనుమతించదగిన వయోపరిమితికి మించి లబ్ధి పొందినవారు ఉన్నారా? బెంచ్ మార్క్ డిజెబిలిటీస్ కలిగిన వ్యక్తులకు లభించే ప్రయోజనాలను అనర్హులు పొందారా? అనే అంశాలపై కూడా దర్యాప్తు జరపాలని పాటియాలా కోర్టు ఆదేశించింది.

కోచింగ్ సెంటర్ ఘటనలో కారు డ్రైవర్‌కు బెయిలు

న్యూఢిల్లీ: ఢిల్లీలోని రావూస్ కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్లో నీరు చేరి ముగ్గురు మరణించిన కేసులో అరెస్టయిన కారు డ్రైవర్ మనూజ్ కథూరియాకు ఢిల్లీలోని సెషన్స్ కోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. ఢిల్లీ పోలీసులు మితిమీరిన ఉత్సాహాన్ని ప్రదర్శించారని ఎండగట్టింది. మనూజ్ నిర్లక్ష్యంగా కారును నడపటం వల్ల రోడ్డుపైన ఉన్న నీరు బేస్‌మెంట్‌లోకి చేరిందని, తద్వారా ఆయన వీరి మరణానికి కారణమయ్యారని పోలీసులు ఆరోపించారు.

ఇజ్రాయెల్‌పై యుద్ధమే

- ప్రత్యక్ష దాడికి ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ ఆదేశం
- పశ్చిమాసియాలో మరింత తీవ్రమవుతున్న ఉద్రిక్తతలు

టెహ్రాన్, ఆగస్టు 1: పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ మేఘాలు అలుముకున్నాయి. ఏ క్షణంలోనైనా ఇజ్రాయెల్‌పై శత్రుదేశాలు దాడికి దిగే అవకాశం ఉంది. తమ సొంత గడ్డపై హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియాను హత్య చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఇరాన్ అగ్రనేత అయతుల్లా అలీ ఖమేనీ.. ఇజ్రాయెల్‌పై నేరుగా దాడి చేయండి అంటూ ఆదేశించినట్టు ముగ్గురు ఇరాన్ అధికారులను ఉటంకిస్తూ 'న్యూయార్క్ టైమ్స్' వెల్లడించింది. హనియా మరణానంతరం బుధవారం ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ అత్యవసరంగా సమావేశమైంది. ఇజ్రాయెల్‌పై దాడి చేయాలంటూ ఆ సమావేశంలో ఖమేనీ మిలటరీకి ఆదేశాలు ఇచ్చినట్టు అధికార వర్గాల ద్వారా తెలిసింది. 'ప్రతీకారం మా విధి. వారి కోసం కఠినమైన శిక్షను సిద్ధం చేశాం' అని ఆయన వ్యాఖ్యానించినట్టు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఇరాన్ ఇలాంటి సమావేశాన్ని నిర్వహిస్తుంది. ఏప్రిల్‌లో సిరియాలో ఇద్దరు ఇరాన్ మిలటరీ కమాండర్లను వైమానిక దాడిలో ఇజ్రాయెల్ హతమార్చినప్పుడు కూడా ఇదే తరహా సమావేశాన్ని నిర్వహించారు.

హనియా మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఖమేనీ

ఎవరు.. ఎవరి పక్షాన?

ఒకవేళ ఇరాన్ కనుక ఇజ్రాయెల్‌పై దాడికి దిగితే ఎవరు ఎవరికి మద్దతు ప్రకటిస్తారు అన్న విషయాన్ని పరిశీలిస్తే ఇరాన్ దళాలకు హమాస్, లెబనాన్‌లోని హెజ్బొల్లా, యెమెన్‌లోని హౌతీలు, ఇరాక్‌లోని మిలీషియా గ్రూపులు మద్దతుగా రానున్నాయి. అదే సమయంలో ఇప్పటికే పటిష్టమైన శత్రు దాడి నిరోధ దుర్భేద్య వ్యవస్థను కలిగి ఉన్న ఇజ్రాయెల్‌కు సహాయంగా అమెరికా నేరుగా యుద్ధంలోకి దిగకపోయినా ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం విషయంలో అండగా నిలుస్తుందని భావిస్తున్నారు.

హమాస్ మిలిటరీ చీఫ్ హతం

డెయిఫ్

జెరూసలెం, ఆగస్టు 1: ఒక వైపు తమపై యుద్ధానికి ఇరాన్ సహా పలు ఉగ్రవాద సంస్థలు సన్నద్ధమవుతున్నా ఇజ్రాయెల్ ఏ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. జూలై 13న తాము జరిపిన వైమానిక దాడిలో హమాస్ మిలటరీ వింగ్ చీఫ్ మహ్మద్ డెయిఫ్ హతమైనట్టు ఇజ్రాయెల్ గురువారం నిర్ధారించింది. గత ఏడాది అక్టోబర్ 7న తమ దేశంపై జరిగిన దాడిలో డెయిఫ్, హనియా ప్రధాన సూత్రధారులని తెలిపింది. పలు మార్లు డెయిఫ్ తమకు చిక్కినట్టే చిక్కి తప్పించుకున్నాడని, జూలైలో గాజాలో జరిగిన దాడిలో ఎట్టకేలకు హతమయ్యాడని ఇజ్రాయెల్ ప్రకటించింది. దీనిపై హమాస్ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి అనంతరం ఎట్టి పరిస్థితుల్లో హమాస్ చీఫ్ హనియాను, ఇతర నేతలను హతమార్చి తీరుతామంటూ ఆ దేశం ప్రతిజ్ఞ చేసింది.

యుద్ధానికి మేము రెడీ..

ఇరాన్, దాని మిత్ర దేశాలు జరిపే ఎలాంటి దాడినైనా ఎదుర్కోవడానికి పూర్తి సన్నద్ధతతో ఉన్నామని ఇజ్రాయెల్ వెల్లడించింది. కాగా హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హత్యకు ఇజ్రాయెలే కారణమంటూ ఇరాన్, హమాస్ ఆరోపిస్తుండగా, ఇజ్రాయెల్ మాత్రం ఎలాంటి ప్రకటన చేయలేదు. అయితే ఇస్మాయిల్ హత్య అనంతరం 'మాకు వ్యతిరేకంగా ప్రదర్శించే ఎలాంటి దూకుడుకైనా భారీ మూల్యం తప్పదు' అని ఇజ్రాయెల్ ప్రధాని వ్యాఖ్యానించారు.

తక్షణం లెబనాన్ వీడండి

భారత పౌరులకు ఎంబసీ అడ్వైజరీ

బీరుట్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో హమాస్ చీఫ్ ఇస్మాయిల్‌ను హత్య చేయడంతో ఇవి తారస్థాయికి చేరుకున్నాయి. ఏ క్షణంలోనైనా ఇరాన్, లెబనాన్ ఇజ్రాయెల్‌పై దాడికి దిగవచ్చునన్న వార్తల నేపథ్యంలో లెబనాన్ రాజధాని బీరుట్‌లోని భారత ఎంబసీ మన దేశ పౌరులకు అడ్వైజరీ జారీ చేసింది. భారత పౌరులు తక్షణం ఆ దేశాన్ని వీడాలని సూచించింది.

జూలైలో 8,383 మంది టెకీలకు ఉద్వాసన

న్యూఢిల్లీ: ప్రపంచ వ్యాప్తంగా టెక్నాలజీ రంగంలో ఉద్యోగుల తొలగింపు పర్వం కొనసాగుతున్నది. ఈ ఏడాది జూలైలో 34 ప్రముఖ టెక్ కంపెనీల్లో 8,383 మంది సాంకేతిక నిపుణులకు ఉద్వాసన పలికారు. ఈ ఏడాది మొత్తం చూస్తే జూలై 30 వరకు 380 కంపెనీలు 1,90,949 మంది ఉద్యోగులను ఇంటికి పంపాయి. ఖర్చులు తగ్గించుకోవడానికి కంపెనీలు లేఆఫ్‌లు ప్రకటిస్తున్నాయి.